కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మోసం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఎన్నికల ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభ పెట్టి బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. పార్టీ పరంగా 42 శాతం సీట్లిస్తామని కాంగ్రెస్ పార్టీ నయా మోసానికి తెరలేపింది. ఇతర పార్టీలు కూడా బీసీలకు 42 శాతం సీట్లివ్వాలని సీఎం చాలెంజ్ చేయడం సిగ్గుచేటు. బీసీ రిజర్వేషన్లు అనేవి కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాదు. చట్టబద్ధత కూడిన రిజర్వేషన్లను అమలు చేస్తే అన్నింట్లో బీసీలకు రిజర్వేషన్లు అమలవుతాయి.

- పెద్ది సుదర్శన్‌రెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే

బీసీలను దగా చేసిన కాంగ్రెస్ సర్కార్

బీసీలను కాంగ్రెస్ సర్కార్ నిలువునా ముంచింది. జనాభా పరంగా దక్కాల్సిన రిజర్వేషన్లను అందకుండా చేసింది. నాటి ప్రధాని నెహ్రూ సైతం బీసీలను మోసం చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల క్రమంలో ఇప్పటివరకు విద్యా, ఉద్యోగ రంగాల్లో మాత్రమే 27శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. చట్టసభల్లో అమలు చేయకుండా ద్రోహం చేశారు. కుల గణన పేరుతో బీసీలను మోసం చేసేందుకు కుట్రలు చేసింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకపోతే ప్రభుత్వం మెడలు వంచి తీరుతాం.

- పుట్ట మధూకర్, మంథని మాజీ ఎమ్మెల్యే

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత మధుసూదనాచారి, చిత్రంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రులు జోగు రామన్న, గంగుల కమలాకర్, బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్

కాంగ్రెస్ దగా బట్టబయలు

చట్టసభల సాక్షిగా బీసీలకు మళ్లీ మోసం

ఫిబ్రవరి 4 బీసీలందరికీ ఒక దుర్దినం

- కావాలనే బీసీ జనాభాను తగ్గించారు
- అసెంబ్లీ, మండలిలో మాగొంతు నొక్కారు
- ఓ సామాజికవర్గం జనాభా పెంచి చూపారు
- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి
- 15 రోజుల్లో రీసర్వే మొదలుపెట్టండి:గంగుల
- బీసీలకు ఇన్ జస్టిస్ డే: కేవీ వివేకానంద
- చట్టబద్ధత చేసేదాకా విడిచిపెట్టం: రమణ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): చట్టసభల సాక్షిగా కాంగ్రెస్ పార్టీ బీసీలను మరోసారి దగా చేసిందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచకుండా బీసీలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతున్నదని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్‌తో కలిసి మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ, మండలిలో తప్పుల తడకగా మారిన కులగణన సర్వేను ప్రవేశపెట్టిన ఫిబ్రవరి 4 బీసీలకు దుర్దినమని, బీసీ హక్కుల హననమైన రోజని అభివర్ణించారు. అసెంబ్లీలో, మండలిలో తమ గొంతు నొక్కారని విమర్శించారు. ఒక సామాజిక వర్గం జనాభా పెరిగినట్టుగా చూపారని, ఆ తప్పును ప్రభుత్వం సవరించుకుంటుందని భావిస్తున్నామని చెప్పారు. ఆ సర్వే నివేదికను రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు అంగీకరించడం లేదని చెప్పారు. ఎన్నికల కమిషన్ జాబితా, ఇతర అధికారిక గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రంలో మొత్తం జనాభా 4 కోట్లకు పైనే ఉంటుందని చెప్పారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో సంఖ్యను తక్కువ చేసి చూపారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును అసెంబ్లీ, మండలిలో ప్రవేశపెడతారని తాము ఆశిస్తే, ప్రభుత్వం అలా చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ కుట్రపై బీసీలకు న్యాయం జరిగేవరకు బీఆర్ఎస్ పార్టీ ఉద్యమిస్తుందని చెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ బీసీల వ్యతిరేకి :గంగుల

కాంగ్రెస్ పార్టీ తొలినాళ్ల నుంచే బీసీల వ్యతిరేకి అని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. కులగణన రిపోర్టు ఓ బోగస్ అని, ఇలాగే అశాస్త్రీయంగా చేసిన బీహార్ కులగణనను పాట్నా హైకోర్టు కొట్టేసిందని గుర్తుచేశారు. బీసీ కమిషన్ ద్వారా కాకుండా ప్లానింగ్ శాఖ ద్వారా చేస్తేనే అక్కడి కోర్టు కొట్టేసిందని, తెలంగాణలో కూడా అలాంటి పొరపాటే చేశారని, ఇది న్యాయస్థానంలో నిలబడదని చెప్పారు. గతంలో వివిధ బీసీ కమిషన్లు ఇచ్చిన నివేదికనలను ప్రభుత్వం కనీసం పరిగణనలోకే తీసుకోలేదని విమర్శించారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి తమ నోరునొక్కారని, బుల్డోజ్ చేస్తే భయపడటానికి తాము గొర్రెలమా? అని ప్రశ్నించారు. సగం ఇండ్లకు సర్వే సిబ్బందే వెళ్లలేదని విమర్శించారు. 'అసెంబ్లీ ఎందుకు పెట్టినట్టు? బీసీల కోసం ఏమైనా చట్టం చేశారా? ఎందుకు ఇంత హడావుడి? నెల రోజులు టైమ్ అయినా తీసుకోండి. బీసీల సంఖ్య సరిగా చెప్పండి. ఏదో ఒకరోజును సర్వే కోసం కేటాయించి, 15 రోజుల్లో రీసర్వేను మొదలుపెట్టాలని ప్రభుత్వానికి గంగుల సూచించారు. ఏ ఒక్క బీసీ సంబరంగా లేడని, కేవలం గాంధీ భవన్‌లోనే సంబురాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. కులాలవారీగా జనాభా ఎంతో బయట పెట్టాలని, అలా చేయకుండా ఎన్నికలకు వెళ్తే తెలంగాణ భగ్గుమంటుంది' అని గంగుల హెచ్చరించారు.

రేవంత్ క్యాబినెట్‌లో బీసీ మంత్రులెందరు?: ఎల్ రమణ

సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో బీసీ మంత్రులెందరున్నారని ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రశ్నించారు. ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ పార్టీ తక్కువ టిక్కెట్లు కేటాయించిందని విమర్శించారు. అదికూడా ఓడిపోయే స్థానాల్లో బీసీలకు టిక్కెట్లు ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి వీ హనుమంతరావు లాంటి ఎందరో నేతలు జీవితాలను అంకితం చేశారని, కానీ అలాంటి వారికి సరైన అవకాశాలను ఆ పార్టీ ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం బీసీలను దగా చేయడమేనని, రిజర్వేషన్లకు చట్టబద్ధత చేసే వరకు కాంగ్రెస్‌ను వదలబోమని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి బీసీలను సమాయత్తం చేస్తామని చెప్పారు. దశాబ్దాలుగా జరిగిన తప్పులను సరిదిద్దుతామని ఎన్నికల సమయంలో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ చట్టసభల సాక్షిగా బీసీలను మళ్లీ మోసం చేసిందని ఎల్ రమణ ధ్వజమెత్తారు.

రేవంత్ నటనను బీసీలు నమ్మబోరు: విప్ కేపీ వివేకానంద

ఫిబ్రవరి 4.. తెలంగాణ సోషల్ జస్టిస్ డే కాదు.. ఇన్ జస్టిస్ డే. బడుగు బలహీన వర్గాలకు ఇది చీకటిరోజు.. అని బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బాగా నటించారని, కానీ ఆయన నటనను బీసీలు ఎవరూ నమ్మబోరని స్పష్టంచేశారు. 1952లోనే బడుగు బలహీన వర్గాల కోసం ఖేల్కర్ కమిటీ మంచి సూచనలు చేసిందని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. నీలం సంజీవరెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి వరకు కాంగ్రెస్ సీఎంలందరూ బీసీలను మోసం చేస్తూ వచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజీవ్‌గాంధీ పార్లమెంట్‌లో ఓబీసీ రిజర్వేషన్లకు, కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడాడారని, ఈ రికార్డులు బయట పెడతామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలతో అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు తప్పుడు సర్వేతో బీసీలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డికి తప్పక గుణపాఠం చెప్తుందని హెచ్చరించారు. బీసీలకు జరిగిన అన్యాయంపై కేసీఆర్‌తో చర్చించి ఉద్యమం చేపడతామని చెప్పారు.

2024 జూన్ 24న 'నమస్తే తెలంగాణ' పత్రికలో 'బీసీలకు మొండి చెయ్యే' పేరుతో ప్రచురితమైన కథనం

'నమస్తే' చెప్పిందే నిజమైంది

కాంగ్రెస్ బీసీ డ్రామాను 7 నెలల క్రితమే చెప్పిన నమస్తే తెలంగాణ

కులగణన నివేదికపై వెల్లువెత్తుతున్న విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ): బీసీ డిక్లరేషన్ పేరుతో ఎన్నికల వేళ వెనుకబడిన తరగతులకు హామీలు కురిపించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆచరణలో మాత్రం విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కులగణనలో బీసీ కోటాను తగ్గించి చూపించడంలో కుట్ర దాగి ఉందని బీసీ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తూతూమంత్రంగా శాసనసభ తీర్మానం చేసి, కేంద్రానికి పంపి చేతులు దులుపుకొందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ నైజాన్ని 7 నెలల క్రితమే నిరుడు జూన్ 24న 'బీసీలకు మొండి చెయ్యే' నమస్తే తెలంగాణ కథనం ప్రచురించింది. తాజాగా కులగణన–శాసనసభ తీర్మానం–కేంద్రానికి నివేదన నేపథ్యంలో నమస్తే చెప్పిందే నిజమైందని రాజకీయవర్గాలు, ప్రజలు, పాఠకుల్లో చర్చ జరుగుతున్నది.

బీసీ రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి దగా

పార్టీపరంగా టిక్కెట్లు ఇస్తామనడం మోసం : కృష్ణయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి5 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి దగా చేశారని, చట్టపరంగా కాకుండా పార్టీపరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామనడం మోసపూరితమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు బీసీల రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పుడు మాటతప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయకుండా తప్పించుకోవాలని చూస్తే రాష్ట్రంలో మరో సంగ్రామం తప్పదని హెచ్చరించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 14 నెలల్లో ఒక్కరికీ రుణాలు ఇవ్వలేదని, ఫెడరేషన్లకు చైర్మన్లను నియమించలేదని, ముఖ్యమైన పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యం తగ్గిందని, బీసీ విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించడం లేదని విమర్శించారు. నేడు ఢిల్లీలోని ఏపీ భవన్‌లో బీసీ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పాల్గొనాలని కేంద్రమంత్రి రాందాస్ అథవాలెను సంఘం నేతలతో కలిసి ఆహ్వానించారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు

సీఎం పీఠం కోసమే ఫేక్ సర్వే

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కులగణన కాదు
- బీసీలకు 42శాతం చట్టబద్ధ రిజర్వేన్లు కల్పించాలి
- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేపట్టిన కులగణన బీసీల కోసం చేసింది కాదని, సీఎం పీఠాన్ని దక్కించుకోవడానికి చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ లక్డీకాపూల్‌లో బుధవారం 'తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ కులగణనపై జరిగిన పరిణామాలు–సీఎం గారి తప్పుడు లెక్కలు–భవిష్యత్తు కార్యాచరణ' అన్న అంశంపై బీసీ సంఘాలు, బీసీ మేధావుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది ముమ్మాటికీ ఫేక్ సర్వే అని, దీనిని బీసీలందరూ తిరస్కరిస్తున్నారని, ఇదే విషయాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల మీద తప్పులు చేస్తున్నదని, ఒక తప్పును కప్పిపుచ్చుకోవడానికి 100 తప్పులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. అసెంబ్లీలో బీసీ కులగణనపై తీర్మానం చేయకున్నా, చేసినట్టు బిల్డప్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు సాధ్యంకాకపోతే పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. పార్టీపరమైన నిర్ణయాలను అసెంబ్లీలో ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందని నిలదీశారు. అసెంబ్లీ ఏమైనా గాంధీభవన్ అనుకున్నారా? గాంధీ భవన్‌లో మాట్లాడాల్సిన మాటలు అసెంబ్లీలో ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని, అసెంబ్లీలో సీఎం మాట్లాడిన మాటలన్నీ కాకమ్మ కథలని, అభూత కల్పనలని అభివర్ణించారు. నిజంగా సీఎం మాటల్లో వాస్తవాలు ఉంటే ఎల్బీస్టేడియంలో కూర్చొని మాట్లాడుదామని సవాల్ చేశారు. బీసీలకు చేసిన అన్యాయాలను నిరూపిస్తామని, లేదంటే ముక్కు నేలకు రాస్తామని సవాల్ చేశారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం పోరాడి అసెంబ్లీలో తీర్మానం చేయించుకున్న మంత్రి దామోదర రాజనర్సింహను చూసి బీసీ మంత్రులు బుద్ధితెచ్చుకోవాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ హితవు పలికారు.

బీసీ జనాభా ఎందుకు తగ్గింది?

- బీసీలను అవమానించేందుకే అసెంబ్లీ పెట్టారు
- బీఆర్ఎస్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్
- కాంగ్రెస్ సర్వే జాబితాలు కాకిలెక్కలు: దాస్యం
- కాంగ్రెస్ నేతలను నిలదీయాలి: కోరుకంటి
- ఓటర్ల సంఖ్యకు సర్వేకు తేడా: అంజయ్యయాదవ్
- బీసీలకు చట్టబద్ధ రిజర్వేషన్లు ఇవ్వాలి: జైపాల్‌యాదవ్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, దాస్యం వినయ్‌భాస్కర్, కోరుకంటి చందర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా బీసీల జనాభా పెరుగుతుంటే తెలంగాణలో మాత్రం బీసీ జనాభాయే ఎందుకు తగ్గిందని మాజీ మంత్రి, దక్షిణ భారత ఓబీసీ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు వీ శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కులగణన సర్వేలో బీసీల జనాభా తగ్గినట్టు ఎందుకు చూపారని నిలదీశారు. బీసీలను అవమానించడానికే హడావుడిగా అసెంబ్లీ మీటింగ్ పెట్టారా? అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ సమావేశంలో, అసెంబ్లీలో ఎందుకు తీర్మానం చేయలేదని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, కోరుకంటి చందర్, అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తమిళనాడు తరహాలో న్యాయపరమైన చిక్కులు లేకుండా సర్వే చేపట్టారా? అని ప్రశ్నించారు. కులసంఘాల నేతలు, ఎంతోమంది మేధావులు చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వినడంలేదని నిలదీశారు. రాష్ట్రంలో బీసీ జనాభాను తగ్గించి చూపడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మళ్లీ సమగ్ర కుటుంబ సర్వే చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలను, ముస్లింలను కలపడం వెనుక కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్ర దాగి ఉన్నదని విమర్శించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎటువైపు?: దాస్యం

కాంగ్రెస్‌లోని బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆ పార్టీ వైపా? బీసీ ప్రజల వైపో తేల్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీనే ఆ పార్టీ ప్రభుత్వం చేపట్టిన సర్వేను తగులబెట్టాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఇలాంటి తప్పుడు సర్వేను మిగతా పార్టీలు ఎలా నమ్ముతాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాకిలెక్కలు చెప్తూ బీసీ జనాభాను తక్కువగా చూపిస్తున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ చర్చను బీసీ కుటుంబాలు ఎంతో ఆసక్తిగా చూశాయని, కానీ, బీసీలు రాష్ట్రంలో 42 శాతమే ఉన్నట్టు సర్వే లెక్కల్లో చూపడంపై భగ్గుమంటున్నారని చెప్పారు.

పొంతన లేని లెక్కలు: అంజయ్యయాదవ్

ఓటర్ల సంఖ్యకు, తెలంగాణ జనాభా లెక్కలకు, కులగణన సర్వేకు ఎక్కడా పొంతన కుదరడం లేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ విమర్శించారు. కులగణన అంటే రాష్ట్రంలో ఏ కులం వారు ఎంత మంది ఉన్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. కానీ, కులాలవారీగా జనాభాను మాత్రం సక్రమంగా సర్కారు వెల్లడించడం లేదని విమర్శించారు. బీసీలను మోసగించడం తప్ప కాంగ్రెస్ సర్కారుకు బీసీల పట్ల ప్రేమ కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ సర్కార్‌ను ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేతలను నిలదీయాలి: చందర్

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ సర్కార్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలను ఎక్కడికక్కడ బీసీలు నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. బీహార్, కర్ణాటకలో మోసం చేసినట్టుగా తెలంగాణలో కూడా బీసీలను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం చేయించిన సర్వేలెక్కలు తప్పుల తడక అని, తమ జనాభాను తక్కువ చేసి చూపించడం పట్ల బీసీలు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో బీసీలు 50 శాతానికి పైగానే ఉండాలని, కానీ, 46 శాతానికి పరిమితం చేయడంపై ఆగ్రహంతో రగిలిపోతున్నారని చెప్పారు.

రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఇవ్వాలి: జైపాల్‌యాదవ్

బీసీలకు స్థానిక సంస్థల్లో రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీపరంగా 42% రిజర్వేషన్లు ఇస్తామనడం రాజ్యాంగబద్ధం కాదని పేర్కొన్నారు. బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా ఉండేందుకే బీసీ జనాభాను తక్కువ చేసి చూపించారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలు ఇచ్చి బీసీలను నమ్మించి అధికారంలోకి వచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డికి అనుభవం, అవగాహన లేదని విమర్శించారు.

రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తాం

తాజా కులగణన ప్రకారం బీసీలు 1.85 కోట్ల మంది ఉంటే.. దామాషా ప్రకారం 51 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. కానీ ఇటీవలి సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీ జనాభా 46 శాతమే ఉన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నది. ఇది కచ్చితంగా మోసమే. 2014 నాటి సమగ్ర కుటుంబ సర్వేలో 56 శాతంగా ఉన్న బీసీలు తాజా సర్వే నాటికి ఇంత భారీగా ఎలా తగ్గుతారు? కొత్త ఫార్మాట్‌లో బీసీ కులగణన చేపట్టాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి. లేదంటే ఉద్యమిస్తాం.

- వనమా వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధిచెప్పాలి

బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 52 శాతంగా ఉన్న బీసీ జనాభా ప్రస్తుత కుల గణనలో 46.25 శాతంగా చూపడంలో పెద్ద కుట్ర దాగి ఉన్నది. ఇది బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక ఫలాలు అందకుండా చేయడమే. రాష్ట్రంలోని బీసీల జనాభా శాతాన్ని తగ్గించి చూపారు. బీసీలంతా ఏకతాటిపై నడిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి.

- కొలిపాక శ్రీనివాస్, పెద్దపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్‌లీడర్

ఆయకట్టుకు నీళ్లివ్వాలని అన్నదాతల ఆందోళన

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పాలేరు (బయన్న) వాగులోకి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని బుధవారం కర్కాల గ్రామ రైతులు ఎండిన వాగులో ఆందోళన చేపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండే ఎండల్లోనూ ఈ వాగు నీళ్లతో కళకళలాడేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎండిపోవడంతో ఆయకట్టు బీడుగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

Canara Bank
RECOVERY & LEGAL SECTION
CIRCLE OFFICE, HYDERABAD-500025
EMPANELMENT OF RECOVERY AGENT
Canara Bank Circle Office Hyderabad Invites Application from eligible persons for empanelment as RECOVERY AGENT.
For the Branches in districts of Telangana State. For downloading Application format, Eligibility Criteria & other details please visit Bank's Corporate Website at https://www.canarabank.com under "What's New Section", under "Public Notice-Empanelment OF Recovery Agents for Hyderabad Circle"
Last Date of Application: 25-02-2025
Date: 05-02-2025
Place:- Hyderabad
Sd/- Assistant General Manager, Circle Office, Hyderabad